


"అది కాదురా! చెప్పితే వినవూ, పెట్టవూ, మీకు చెరో తుపాకీ ఎందుకూ? ఈ దీపావళి పండుగ వెళ్ళితే అవతల పారవేసేవేగా!!" అన్నాను నేను విసుగెత్తి.

"నా వొక్కడికీ వుంటే అన్నాయి లాక్కుంటాడు" అన్నాడు చిన్నవాడు.

"వీపు బద్దలుకొట్టనూ లాక్కుంటే–

---

చక్రపాణి

ఏంరా లాక్కుంటావా ? అన్నాను పెద్దవాడితో

ఉహుఁ అన్నాడు పెద్దవాడు

కాదులే నాన్నా నువ్వులేనప్పుడు లాక్కుని లగెత్తుతాడు అన్నాడు చిన్నవాడు.

రెండుగంటలనించి వాళ్ళతో వాదించాను. లాభం లేక పోయింది. అదే అమాయకపు మొండిపట్టు — అవే సూటి సమాధానాలు ! మన ఆధునిక రచయిత ఒకాయన రాసిన వ్యాసాన్ని సంగ్రహించి చిన్నచిన్న డోసులలో కమ్యూనిజాన్ని కూడా ఎక్కించి చూసాను. కాని, మందు పనిచేయలేదు.

"ఇదుగోరా ! మనకి రోలువుందికదా, నెలకి రెండుసార్లకంటే ఎక్కువ వాడతామా దాన్ని" అన్నాను ఇద్దరితో.

"ఉహుఁ" అన్నారు ఇద్దరూ.

"మనకి అక్కర్లేనప్పుడు అదే పదిమందీ వాడుకోవచ్చుకదూ ?" అన్నాను మళ్ళీ.

"ఆఁ" అన్నాడు చిన్నవాడు.

"మరి ఇద్దరికీ ఒక్కనాడే కావలసివస్తే ఎలా నాన్నా ?" అన్నాడు పెద్దవాడు.

"ఒకళ్ళు మానుకోవచ్చు" అన్నాను నేను.

"ఎవరు మానుకుంటారు?" అన్నాడు పెద్దవాడు.

"మనమే ఆగుదాం ఏంపోయింది? అన్నాను నేను

'మన మెందు కాగాలేం ? రోలు మనదికాదూ ? అన్నాడు పెద్దవాడు

"ఎందుకా ? నీమొహానికి ! ప్రతి దానికీ కొక్కిరిస్తావు !" అని పెద్దవాణ్ణి గదిమి నోరు మూయించి, చిన్నవాడిని లాలించాను, "ఏమిరా, తుపాకీ, బిళ్ళలు కొని ముందు నీకిస్తాను, నీ మందు అయిపోయినాక అన్నాయి కిచ్చెయ్యి, తుపాకీ, ఏం ?" అన్నాను. చిన్నవాడు మాట్లాడలేదు, పెద్దవాడివంక చూశాడు 'చెప్పనా ?' అన్నట్టు.

"ఏం ? మరి వెళ్ళుదామా?" అన్నాను చిన్నవాడితో.

చిన్నవాడు చాలాసందేహిస్తూ అసలు రహస్యం బయట పెట్టాడు. "అదికాదు, నాన్నా ! చెరోతుపాకీ ఉంటే చక్కగా ఒకళ్ళమీద ఒకళ్ళం కాల్చుకుని యుద్ధం చెయ్యవచ్చు" అన్నాడు.

ఇదా కీలకం ? పెద్దవాడికి తుపాకీ కొనిపెట్టమని చిన్నవాడు పట్టుపడుతూ వుంటే మొదట నాకు ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే తనకున్న వస్తువు కూడా పెద్దవాడిచేతిలో ఇంకొకటి వుంటే, చిన్నవాడు ఏడ్చి లాక్కునేవాడు. వాడిలో ఈ మార్పుకి, నాకు ఆర్థికంగా కొంత నష్టమైనప్పటికీ, లోలోపల నేను సంతసించాను. కాని, ఈ భాతృస్నేహానికి మూలం యుద్ధజ్వరమని ఇప్పుడు తేలింది!

చిన్నవాడిలో దాగివున్న హింసాప్రవృత్తే ఈ విధంగా స్నేహ రూపంతో బయట పడిం దన్నమాట! నా కిక ఎక్కువాలో చించటానికి మనస్సులేదు. ఇద్దరూ కలిసి నా మీద యుద్ధం ప్రకటించకముందే నేను బజారికి బయలుదేరాను వాళ్ళను వెంటేసుకుని.

యుద్ధంమూలాన అసలే మందు సామాన్ల ధర విపరీతంగా పెరిగి పోయింది. పైగా ఈ సంవత్సరం లైసెన్సులు చాలా కొద్దిమంది మాత్రమే తీసుకున్నారు — విచారించగా వ్యాపారస్తులు తగ్గలేదుగాని, నలుగురైదుగురు కలసి ఒక్క పేరుతో లైసెన్సు తీసుకున్నారని తేలింది. వాళ్ళలో ఈ సంఘీభావం ఎలా వచ్చిందో ఎందుకొచ్చిందోమనకి చెప్పిన వాళ్ళు లేరు. కాని వాళ్ళలో మాత్రం ఈ సంవత్సరం పోటీ లేదు.

వెంకయ్య దగ్గరే నేను నాకు కావలసిన సరుకులు కొంటూ ఉంటాను. నాకు అతనిమీద ఎక్కువ నమ్మకమో, అతనికి నా మీద ఎక్కువమక్కువో చెప్పటం కష్టం. కారణం — వెంకయ్య నలుగురికీ అమ్మే ధరకి నాకెప్పుడూ వస్తువు లమ్మడు. నాకు స్పెషలుధర అని ఇస్తాడు. నేనెప్పుడూ ఇంకోచోట విచారించను. కాని, ఇంకొకరిద్వారా తెప్పించుకుంటే మాత్రం, ఆ సరుకు నాణ్యం తక్కువో, లేక నిలవదో అనుకుంటాను. తక్కువ ధరకు వస్తూఉండేది.

వెంకయ్య ఈ సంవత్సరం లైసెన్సు తీసుకోలేదు. ఐనా సర్వయ్య కొట్లో కూర్చుని ఉన్నాడు. తుపాకీ ఇమ్మని అతన్నే అడిగాను. 'మన దగ్గర అయిపోయిన' వన్నాడు అతను.

పోతే మిగతా కావలసిన చిల్లర సామాన్లు తీసుకుని కుర్రవాళ్ళ కిచ్చి 'ధర ఎంత ఉంటుంది?' అన్నాను. ఇంకొకళ్ళదగ్గర మోసపోకుండా ఉండటానికి. తన దగ్గర లేని సరుక్కూడా వెంకయ్య ధర తగ్గించి చెప్పడవి నా విశ్వాసం.

"నాలుగణాలు చేసి అమ్మేశాము" అన్నాడు వెంకయ్య.

వీటిమీద ఎంత ఖర్చు పెట్టవలసి ఉంటుందా? అని ఆలోచించుకుంటూ నేను బయలుదేరాను. ఒకటి, రెండు, మూడు షాపులు తిరిగాను. అంతా లేవనే చెప్పారు. ఒక్కొక్క కొట్టూ దాటి పోతున్న కొద్దీ నాలో నిస్పృహ ఎక్కువవుతున్నది. బుర్రలో ఎన్నో ఆలోచనలు, మెరుపులాగా మెరిసి పోతున్నై.

గాంధీగారు ఇంతకాలంనించీ అహింసా మహత్యాన్ని బోధిస్తున్నా, పిల్లలు తుపాకీలమీద ఎగబడుతున్నా రెందుకని? వారి సిద్ధాంతాలు పిల్లలదాకా పాకి ఉండకనా? లేక పెద్దవాళ్ళదగ్గరనించి నేర్చుకుని ఉంటారా? పెద్దల దగ్గర నేర్చుకుంటానికి మన మెన్నడూ తుపాకి

కాల్చలేదు సరిగదా, చేత్తో పట్టుకునికూడా చూడలేదే ! కాబట్టి మన దగ్గిరనించి నేర్చుకుని ఉండటం అసంభవం. మరి ? ఇంకో కొట్టు ఎక్కడంతో ఈ ఆలోచనా ప్రవాహం తెగిపోయింది. కాని, నా ప్రశ్నకి ఎక్కడాకూడా లేవనే జవా బొచ్చింది. అనవసరంగా ఇంతదూరం తిరిగినందుకు పిల్లలమీద విసుక్కుంటూ రోడ్డుమీదికి వచ్చాను. దుకాణాల ముందు పెద్దవాడు చల్లగా జారుకున్నట్టు ఉన్నాడు ఎటో, కనబడలేదు. వాడికోసం ఆగాను. ఇంతలో వాడొక కుర్రవాణ్ణి వెంబడేసు కొచ్చి ;

"నాన్నా ! ఈ అబ్బాయి తుపాకి అమ్ముతాడట" అన్నాడు.

"ఒక్క తుపాకీ ఏమిచేసుకుంటారు మీరు ? వద్దులే" అన్నాను. పెద్దవాడు ఏడుపు మొహం పెట్టాడు, చిన్నవాడు శ్రుతి పెట్టుతున్నాడు. బజార్లో వాడు నలుగురికీ తన గాన కళాకౌశలం ప్రద ర్శించకముందే వాడిని వోదార్చి -ఇద్దరూ దానికోసం పోట్లాడుకోకుండా వంతులు వారీగా ఉపయోగించుకునే పద్ధతిలో సంధి కుదిర్చి -తుపాకీ బేరానికిపూనుకున్నాను. నిజంగానాకు ఆకుర్రవాణ్ణి మోసపుచ్చాలని గానీ, వాడి దగ్గర అక్రమమైన ధరకు వస్తువు తీసుకోవాలనిగానీ లేదు. కుర్ర వాడి వ్యాపార చాకచక్యం తెలుసుకుందా మనే నా అభిలాష. "ఎంతకిస్తా వబ్బాయీ, తుపాకీ ?" అన్నాను నేను.

"పావలాకు కొన్నానండీ -" అన్నాడు వాడు.

నేను మధ్యనే - "పావలాకు కొంటే రెండు మూడురోజుల నించైనా వాడుకొని వుంటావు, పాతది ఎవరు కొంటారు ? బేడ కిస్తావా ?" అన్నాను.

"ఇప్పుడసలు దొరకటం లేదు కదండీ" అన్నాడు కుర్రవాడు.

"దొరకకపోతే మా చబ్బులే మిగు లుతై - మరీ మంచిది ! ఏం, నువ్వు కుర్రవాడి వని ఇంకో అర్ధణా ఎక్కు విస్తాను. ఒప్పుకున్నావా ?" అన్నాను.

నేను ఈ మాటలు అనేటప్పుడు ఎక్కడా నాకు తుపాకీ అవసరంవుం దన్న భావం కనపడనీయలేదు. పిల్లల బలవంతాన నేను తుపాకీ కొంటున్నానని ఆ కుర్రవాడు గ్రహించాడని నాకు తెలుసు. ఐనా అతనికి నమ్మకం కలగకుండా వుంటానికి చిన్నవాడి చెయ్యి పట్టుకుని "పదండిరా, ఇంకోచోట కొత్తదే కొను క్కుందాము" అన్నాను. ఈ డాబుకూడా బాగా పనిచేసింది. కుర్రవాడు 'తీసుకోం' డని తుపాకీ నా చేతి కిచ్చాడు. బేడా అర్ధణా కుర్రవాడి కిచ్చాను. కుర్రవాడు అక్కడ వుండలేదు, ఇక -, మిగతా అణన్నర కొంచెం ఏడిపించి ఇద్దామను కున్నప్పటికీ ! తుపాకీ బిళ్ళలకోసం కొట్లోకి వెళ్లాను. షాపతను 'అయి పోయినై ' అన్నాడు. మళ్ళీ ఒక్కొక్క కొట్టే ఎక్కుతూ వెంకయ్య కొట్టు